

# మూగవేదన

వాలివేటి నాగచంద్రావతి



"దయచేసి వినండి. ఢిల్లీపోవు లింక్ ఎక్స్‌ప్రెస్ అయిదవ నంబరు ప్లాట్ ఫారమ్ నుండి అయిదు నిమిషములలో బయలుదేరును." ప్లాట్ ఫారమ్ మీదనించీ అనౌన్సర్ ద్విభాషల్లోనూ హెచ్చరిక చేసింది.

సెకండ్ క్లాస్ లేడిస్ కంపార్టు మెంట్‌లో కూర్చున్న అపర్ణకు ఒక్క క్షణం గుండె కొట్టుకోడం మాని, మరుక్షణం విజృంభించి పని చెయ్యడం ప్రారంభించింది. అరి చేతులూ, అరి కాళ్లూ వణుకొస్తున్నంత పనయ్యింది.

ప్లాట్ ఫారమ్ మెట్లెక్కిబయటకు పోబోతున్న అన్నగారు రవి, అమాంతం వెనక్కి తిరిగి బండి, దగ్గరకి పరిగెత్తుకు వచ్చాడు. చెల్లెలి ఆందోళన గమనించకుండా కంగారుగా, విసుగ్గా, "ఆపూ! టైమైపోయింది. బయటకు వెళ్లి వచ్చే వేళలేదు. పాలడబ్బా ఎలాగ? అయినా ఇప్పుడా చూసుకోడం? మళ్లీ వారం రోజులనించీ ఎడతెరిని లేకుండా సద్దుతున్నారు. ఛఛ.... ఏం మనుషులో..... సరే, రేపటిదాకా సరిపోతుందన్నావు కదూ పాలపొడి! ఒక పని చెయ్యి. రేపు నాగపూర్‌లో దిగగానే ముందు బావచేత పాలడబ్బా తెప్పించి మరీ బండి మారండి. ఏం? జ్ఞాపక ముంచుకుంటావా?" అన్నాడు ఆత్రంగా.

"సరే....సరే...." అన్నది అపర్ణ ఏదో లోకంలో ఉన్నట్టు. ఆమె మెదడెప్పుడో పనిచెయ్యడం మానేసింది..

ఇదేమీ గమనించని రవి టైమ్ అయిందనే కంగారులో, "ఆc.....ఆపూ! టైమైపోయింది జాగ్రత్త. సామానంతా దగ్గిరుంచుకున్నావు కదూ? బావకి టెలిగ్రామ్ ఇచ్చేశాను. నాగపూర్‌లో దిగగానే బావవచ్చి కలుసుకుంటాడు. మరేం భయంలేదు. నువ్వెక్కడా మారక్కర్లేదు. ఏం? వింటున్నావా?'' అంటూ హడావిడిగా అప్పగింతలు పెడుతున్నాడు.

విన్నా, వినకపోయినా అన్నిటికీ అయోమయంగా "ఆc...ఊc" అంటున్న వివర్ణమైన అపర్ణమొహం అప్పుడు చూశాడు రవి.

బిక్కమొహం వేసిన అపర్ణను చూసేసరికి జాలి వేసింది.

నిన్న మొన్నటి వరకూ తనతో మొట్టికాయలు తినేది అపర్ణ. కాలేజీకి, ఇంటికీ తప్ప ఒంటరిగా, పక్కవీధికి వెళ్లడానికి భయపడే అపర్ణని తొలిసారిగా కాపరానికి ఒంటరిగా పంపాలిసి వచ్చింది. సమయ మాట్లాంటిది, మరి.

తనకి ఫైనల్ ఎగ్జామినేషన్సు దగ్గిర

వడుతున్నాయి. నాన్నకి ప్రయాణం పనికిరాదు. అమ్మ ఆయన ఆలనా పాలనా చూస్తూ కదలడానికి వీలులేదు. ఈ కారణాలతో వచ్చి తీసుకెళ్ల వలసిందని బావకి రాశారు నాన్న. కాని తనకు సెలవు లేదనీ, విజయవాడలో ట్రెయినెక్కించి తనకి టెలిగ్రామిస్తే నాగపూర్‌లో కలుసుకుని అక్కణ్ణించీ గోండియా తీసుకువెడతాననీ తిరుగు జవాబిచ్చాడు బావ.

అలా అపర్ణ ప్రయాణం ఒంటరిగా చేయించటం తప్పనిసరి అయింది. ప్రయాణం దగ్గిరపడే కొద్దీ అపర్ణకు ఆదుర్దా ఎక్కువయిపోయింది. భర్త దగ్గిరికి మొదటిసారిగా వెడుతున్న ఉబలాటంకంటే, ఈ ప్రయాణం ముగించే దెట్లాగా అన్న దిగులే ఆమెను ఎక్కువగా బాధించడం మొదలెట్టింది.

బలిపీఠం ముందుకు తోసుకుపోయే వాహనంలా ఉంది రైలామెకు. ఆ క్షణంలో 'ఈ ప్రయాణం తప్పి పోకూడదా' అని లక్షసార్లనుకున్నది.

కాని అదేం జరిగేది కాదన్నట్టు, 'కయ్యి'మని ఒక్క కేక వేసి, గుభిల్లని కదిలింది ట్రెయిన్

ఎదలో రొదతో సతమత మవుతున్న అపర్ణకు, "పాపాయి జాగ్రత్త! చేరగానే టెలిగ్రామ్...." అందున్న అన్నగారి వీడ్కోలు వాక్యాలు చెవిలోకి దూరకుండానే కనుమరుగు చేసేసింది ఆ దయమాలిన ట్రెయిన్.

పావ ఏడుపుతో తాను పూర్తిగా ఒంటనిదాన్ని కాదని తాత్కాలికంగా ఊరట కలిగి తెరిపిన పడి పాపాయిని గుండె కదుముకుని జోకొట్టింది అపర్ణ.

చెమ్మగిల్లినతనకళ్లవంకే విచిత్రంగా చూస్తున్న ఎదురు సీటు బెంగాలీ యువతి, తానటు చూడగానే, అలా చూడ్డం సభ్యత కాదనుకుందేమో, కళ్లు తిప్పుకుని కిటికీ లోంచి బయటకు చూస్తూంది.

'తెల్లని మనిషేమో జబ్బలపైకి జాకెట్టయినా అందంగా ఉంది. కాని, చెవుల్ని మించిన సైజులో ఆ రింగులు ఎబ్బెట్టుగా ఉన్నాయి' అనుకుంది అపర్ణ. క్షణం అన్నీ మరిచి స్త్రీ సహజంగా అందాల హుందాగిరీమీదకీ, అలంకారాల ఆశల మీదికీ ఆమె ధ్యాస మళ్లింది.

పక్కసీట్లమీద ఆడవాళ్లిద్దరూ, ఎదరసీట్ల వాళ్లతో, మధ్య పెట్టెల్ని టేబిల్‌గా అమర్చుకుని పేకాటలో పడ్డారు మగరాయళ్లలాగా. వాళ్లపక్క కూర్చున్న అరవ మామి మాటి మాటికి ఎదురుసీట్లో కూర్చున్న కూతుర్ని కాబోలు, పలకరిస్తూ పుస్తకంలో లీనమైన ఆ పిల్లని డిస్టర్బ్ చేస్తూంది.

ఒక్కరూ ఆ స్టేషన్లో రైలెక్కిన వారు కాదు! ఒక్కరిదీ తన భాష కాదు! నిట్టూర్చింది అపర్ణ బరువుగా.

పాప ఒళ్లోనే నిద్రపోతూంది. పక్క వేసి ఒళ్లోంచి తీసి సరిగ్గా పడుకోబెట్టింది. గుప్పిళ్లు మూస్తూ, తెరుస్తూ నోరు చప్పరిస్తూంది పాప నిద్దట్లోనే. పాలబుగ్గలు, పలచటి పెదాలు, వంకీల జుట్టు పాప అచ్చం వాళ్ల నాన్న పోలికే, తన ఫ్రెండ్ సుజాత అన్నట్టు. ఒక్కసారి, అదైనా పెళ్లిలో చూసిందంతే. సుజాత కెంతజ్ఞాపకమో!

తాను మాత్రం ఆయనతో ఎక్కువ కలిసున్న దెక్కడ? పెళ్లిలో మూడు నిద్దర్ల తరవాత పది రోజుల అత్తవారింట్లో ఉండి వచ్చేసింది. అప్పుడే ఆయనకి గోండియాకి ట్రాన్స్‌ఫర్ అయింది.

గోండియా వెళ్లే ముందు పండగ వంకని వచ్చి తననికూడా తీసుకువెళ్లి పోతానన్నారు. అప్పుడు బయట పెట్టింది అమ్మ, తనకి రెండో మాసం దాటబోతూందని.

పావం, ఆయన అవన్న ఏమని వర్ణించడం! చాలా నిరుత్సాహపడి పోయారు.

"ప్చ్..... నా ప్లానంతా చెడ గొట్టేశావ్, ఆపూ! అలా జాలీగా ఒక్క హనీమూన్ ట్రిప్పన్నా లేకుండా ఏం తొందరొచ్చిందటా?" అన్నారు నిరాశగా, జాలిగా నవ్వేసి ఊరుకున్నది తను. తనలో చోటు చేసుకున్న పావ మీద ఎంతో తిరస్కారం కలిగిందాక్షణంలో నిష్కారణంగా.

కాని, అమ్మా నాన్నా, ముఖ్యంగా అత్తగారూ మామగారూ ఎంత సంతోషించారో మాటల్లో చెప్పలేం. 'పాతికేళ్ల తరవాత మా ఇంట మహా లక్ష్మి కలగబోతూంది' అంటూ అత్తగారు మహా మురిసిపోయారు.

ఆవిడకు ఆయనొక్కరే ఏకైక సంతానం.

తాత్కాలికంగా రద్దయిపోయింది తన ప్రయాణం. వెళ్లాలని ఉన్నది తనకు, తీసుకువెళ్లాలని ఆయనకూ ఉన్నది. కాని, పెద్దవాళ్లు ఒప్పుకోందే? "అమ్మయ్యో! అంత దూరాన, 'నా' అన్న వాళ్లు లేనిచోట, అడివిలాంటి ఆ ఊరిలో కావరమా? తొలిచూలు. మరేమన్నా ఉందీ?" అంటూ వాళ్లు హడలిపోయి, తమని హడలగొట్టేసి, కొనకి, "ఏముందీ, పది నెలలు కళ్లు మూసుకున్నావంటే పాపాయితోనహా పరిగెత్తుకు చక్కా వస్తుంది నీ దగ్గిరికి" అని ఊపశమన వాక్యాలు పలుకుతూ సాగనంపా రాయన్ని.

ఉత్తరాలూ, విరహతాపాల మధ్య పది నెలలల్లా పదమూడు నెలలు గడచాయి.

పాప పుట్టాక మూడు నెలల బాలింతా, పథ్యం పానం అంది అమ్మ. ఆ పైన అత్తగారు, "మళ్లీ ఎప్పుడొచ్చేనో ఏమో!

మాకు మాత్రం అచ్చటా ముచ్చటా తీరొద్దా?" అని అట్టి పెట్టేసుకుని మరో రెండు నెలలు జరిపేశారు. దూరాన ఉన్న ఆయన ఉత్తరాల వాడి తనను బాధించినట్టు వాళ్లని వేధించదయ్యె. ఎలాగయితేనే.... ఆఖరికి ఆటంకాన్నీ గడిచి ఇదిగో..... ఇన్నాళ్లకీ.... ముడిపడింది ఈ ప్రయాణం.

టక్కున ఆగింది ట్రెయిన్. గతంలోనించి ఊడిపడ్డది అపర్ణ. తన ఆలోచనల్లాగే ఎన్ని స్టేషన్లు వెనక్కి వెళ్లాయో అనుకున్నది.

మళ్లీ తన ఒంటరి ప్రయాణం గుర్తువచ్చి గుండెల్లో సన్నగా గుబులు పుట్టుకొస్తూంది.

తలుచుకుంటే తనేనా ఈ ప్రయాణం చేస్తున్నదీ అనిపిస్తూంది. తానెంత పిరికిది, ఎంత మొగమాటస్థురాలు!

మూడేళ్లు కాలేజీలో చదువు వెలగ బెట్టిందన్న మాటేగాని, ఒక్కనాడైనా ఒంటరిగా కాలేజీకీ వెళ్లేందుకు సాహసించలేదు. పక్కవీధి వసుంధరకీ, తనకీ జోడి. ఆ అమ్మాయి ఏ కారణంచేతైనా నాగా అయితే, బుద్ధిగా రిక్షామీద వెళ్లి రిక్షామీద తిరిగి వచ్చేసేది. కాలేజీ విడిచాక మరో క్షణం అక్కడుండడానికి భయం, చీకటి పడిపోతుందేమోనని. సుజాత ఎప్పుడూ వేళాకోళం పట్టిస్తుండేది తనని. "చీకటి పడితే అపర్ణని తోడేళ్లెత్తుకుపోతాయి. వరిగెత్తమ్మా వరిగెత్తు" అనేది. "ఆలస్యమయితే ఇంటి దగ్గిర పిల్లా జెల్లా, గొడ్డూ గోదా ఎదురు చూస్తుంటాయి. వెళ్లి పోనియ్యండే,,పాపం!" అని తోటి క్లాస్‌మేట్స్ దగ్గర వెక్కిరిస్తుండేది. ఆ మాటలకు రోషం పొంగుకువచ్చినా తన మనస్తత్వం మాత్రం మార్చుకోలేకపోయింది.

చిన్న చిన్న విషయాలలోకూడా తనకు చొరవ లేదు. సురేఖ కాలేజీ డిబేట్స్‌లో ఢంకా బజాయించి మాట్లాడినప్పుడూ, నళినీరావ్ కాలేజీ ఫంక్షన్‌లో ఎంతో చక్కగా నాట్యం చేసినప్పుడూ- వాళ్లకి అందరితోపాటు కంగ్రాట్స్ చెప్పాలనీ, మెచ్చుకోవాలనీ ఎంతెంతో ఉవ్విళ్లూరేది. కాని, ఏదో బెరుగ్గా ఉండి, లోలోపలే వాళ్ల నారాధిస్తూ, సంతృప్తిపడి చక్కా ఊరుకునేది.

ఒకసారి తను వీధిలోనే ఉన్న లెక్చరర్ ఒకామె తనకు లీవ్‌లెటర్ ఇచ్చి ప్రిన్సిపాల్‌కి ఇమ్మన్నారు. కాదనటానికి మొహమాటపడి, ఆ మాత్రం ఇవ్వలేకపోతానా అని ధైర్యం చేసి తీసుకున్నది. తీరా ప్రిన్సిపాల్ రూమ్‌కి వెళ్లేసరికే తన కాళ్లు గజగజలాడ్డం మొదలుపెట్టాయి.

ప్రిన్సిపాల్ యూజినీ అలెగ్జాండ్రయా ఫక్తు అమెరికన్, చూడ్డానికి మహాగంభీరంగా ఉంటుంది. ఆవిడ రూపమంటేనే ముందునించీ తనకి బెదురు. పోనీ, వెనక్కీ తిరిగి వెళ్లి ఏ సుజాతనో బతిమలాడదామా అనుకుని, ఆ తరవాత దాని వెక్కిరింతలన్నీ గుర్తువచ్చి, ఆ పనికంటే తనే ధైర్యం తెచ్చుకోడం మేలనిపించింది. ఎలాగో ప్రిన్సిపాల్ ఎదట పడింది. కాని, నోటివెంట మాట ఊడివస్తేగా, లీవ్ లెటర్ టేబుల్‌పైన పెట్టి ముందుకు తోస్తూ ఏదో అనేసింది తను. దాని నావిడ చూసుకొలేదు. తననే గుచ్చి గుచ్చి చూస్తూ ఏమిటో అడుగుతూంది. ఆమెకు తెలుగు రాదు. ఆ ఇంగ్లీషైనా అదేమి ఉచ్చారణో ఆ భగవంతుడికి ఆమెకు మాత్రమే అర్థమవుతుంది. ఆ సమయంలో తను మాట్లాడలేకపోతూంది. పైగా, అర్థం కాని కంగారు. ఆమె ఏమంటూందో తనకు తెలియటం లేదు. అన లావిడ మాటే గద్దిస్తున్నట్టు ఉంటుందయ్యె. తన అవస్థ ఏమని చెప్పాలి? ఇటు ఉండటానికీ లేదు, వెళ్లిపోవటానికీ లేదు. తన కిక ఏడుపు వచ్చేసింది. తన కన్నీళ్లు చూసి గాభరా పడిపోయిందావిడ.

సమయానికి సైన్స్ లెక్చరర్ వరద సుందరీదేవి వచ్చి తనని ఆదుకున్నది కాబట్టి సరిపోయింది. ఆవిడకా లీవ్ లెటర్ ఇచ్చేసి, ఎలాగో ఉన్న సంగతి చెప్పేసి బయటపడ్డది తను.

ఆవేళ సైన్స్ అవర్‌లో వరద సుందరీదేవి ప్రిన్సిపాల్ రూమ్‌లో తను చేసిన గల్లంతు వివరించి చెప్పి విరగబడి నవ్వుతుంటే, సిగ్గుతో తన తల వాలిపోయింది. ఇప్పటికీ, ఆ వేళ సుజాత తనని ఆటలు పట్టించిన మాటలన్నీ గుర్తుండిపోయాయి.

అప్పటికీ, ఇప్పటికీ ఏమీ మారలేదు తను. ఆ బెరుకే, ఆ బెదురే, ఆ భయమే ఇప్పటికీ నిలిచి ఉన్నాయి తనలో.

అందుకే ఒక్కత్తే ప్రయాణం చెయ్యాలనేసరికి అదిరిపోయింది. ఆయన్ని తొందరగా చేరుకోవాలన్న ఆరాటమంతా నీరుకారిపోయింది. ఏదో ఆందోళన ఆవరించుకున్నది లోపల.

అన్నయ్యా నాన్నగారూ తన కెంతో ధైర్యం నూరిపోశారు. ఎన్నో సలహాలిచ్చారు. భయం లేదని నచ్చచెప్పారు. తనకు తెలిసిన ఆడవాళ్లలో దేశాలు తిరుగుతున్నవాళ్లని ఉదాహరించారు. ఎలాగో బయలుదేరింది తను.

అయినా ఎన్నో సందేహాలు చుట్టు ముడుతూనే ఉన్నాయి. తా మిచ్చిన టెలిగ్రామ్ ఆయన కందకపోతే? ఈ పోస్టల్ వాళ్లని నమ్మనున్న దెవరు? మొన్నేదో పత్రికలో చదివింది పాతి కేళ్లకో, మరెన్నేళ్లకో చేరిందట ఓ ఉత్తరం. అనుకున్న టైముకు కాక మరొక్క రోజు ఆలస్యంగా అందినా తన పని ఖాళీ.

కాకపోతే ఆ టెలిగ్రామ్ అందేవేళకి ఆయన ఏ క్యాంపులోనో ఉంటేనో? అప్పుడో? తా నా నాగపూర్‌లో ఏమయ్యేట్టు?

ఏం చేసేట్టు? ఆ పరిస్థితి తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తూందే!

"ఏమిటే మరీ వల్లెటూరివెుద్దల్లే మాట్లాడతావ్" అంటాడు అన్నయ్యా.

'నిజమే నాన్న చెప్పినట్టు ఒకవేళ ఆయన రాకపోతే మట్టుకు గోండియాకి ఓ టికెట్టు కొనుక్కుని రైలెక్కలేనూ? ఆభాష తెలియక పోతే మాత్రం ఇంగ్లీషు వచ్చుగా! ఏ టి.సి. నడిగినా అటువైపెళ్లే ట్రెయినేదో చెప్పక పోతాడా? కాని, అందాకావస్తే తను తడబడిపోకుండా ఉంటుందని గ్యారంటీ ఏమిటీ? తీరా చేసి అడిగేటప్పుడు ఎప్పట్లాగే బిక్కమొహం వేసి, ఏడుపు గొంతు పెట్టిందంటే, అదివరకు ఆ ప్రిన్సిపాల్ కంగారు పడ్డట్టే హడిలి పోగలడు ఆ టి.సి. కూడా.

"అయినా, ఇదంతా నా ఊహాగానమే కావచ్చు. బండి నాగపూర్ చేరేవేళకు ఆయన స్టేషన్లో తయారుగా ఉండి తనని కలుసుకుంటారు. తనకే ఇబ్బందీ రాదు. మనస్సులో అలజడిని తొక్కిపట్టి తనని తాను ఓదార్చుకున్నది అపర్ణ.

రైలు ముందుకే, మునుముందుకే పోతూంది తనకేం పట్టనట్టు.

అందరితోపాటు డైనింగ్ కార్లోనించీ భోజనం తెప్పించుకున్నది. పాపకు పాలు పట్టి జోకొట్టి నిద్ర పుచ్చింది. ఆలోచిస్తూ ఎప్పుడు నిద్ర కొరిగిందో తెలియనేలేదు.

భళ్లున తెల్లవారిన తరవాత అరవ మామి హడావిడితో మెలుకువ వచ్చింది. బెంగాలీ యువతికూడా అప్పుడే లేచినట్టుంది. నోటికి వేళ్లడ్డం పెట్టుకుని అందంగా ఆవులిస్తూంది. తనని చూసి స్నేహపూర్వకంగా నవ్వింది. పాప కేరింతలు కొడుతుంటే దాని బుగ్గలు మీటి బెంగాలీలో ఏవో అంటూ మందహాసం చేసింది.

తనకూ మాట్లాడాలనే ఉన్నది. చదువుకున్న మనిషిలానే ఉన్నది వాలకం.

"నాగపూర్ చేరేటప్పటికి ఎంతవుతుందో తెలుసా మీకు?" అన్నది ఇంగ్లీషులో గొంతెలాగో పెగుల్చుకుని.

"బండి బాగా లేట్. మధ్యాహ్నం ఏ రెండో మూడో కావచ్చు" అన్నది వాచీ చూసుకుంటూ ముక్త సరిగా.

మళ్లీ తన ఆదుర్దామొదలు. ఆమె ఢిల్లీ పోతూందిట.

మిగతా వాళ్లలో నాగపూర్లో దిగేవాళ్లున్నారేమో కనుక్కోవాలనిపించింది. ఏదో మొహమాటం తనని నోరెత్తనివ్వటం లేదు. అయినా వాళ్లు తనని పట్టించుకునేటట్టు లేదు. వాళ్ల ఆటలూ, నవ్వులూ, కేరింతలూ తప్ప మిగతా ప్రపంచం పట్టడం లేదు వాళ్లకు.

అరవ మామి టిఫిన్ కారియర్ విప్పి ఫలహారం కానిచ్చి తాంబూలం వేసుకుంటూంది తీరుబాటుగా. ఆవిడ నాగపూర్లో దిగుతుందేమో? ఆవిడకు ఇంగ్లీషు రాకపోవచ్చు. కూతురు నడిగితేనో?

ఇట్లా వాళ్లని గుంజి పెట్టేస్తే.... తీరా మోసి.... ఆయన తనని రిసీవ్ చేసుకుందుకు టంచన్గా హాజరయితే.... తన కంగారుకి ఆ తరవాత వాళ్లు నవ్వుకోరూ?

ఆశా నిరాశల నడుమ ఊగులాడు తుండగానే రైలు నాగపూర్ వచ్చి చేరింది.

స్టేషనంతా కళ్లతోనే ఆత్రంగా గాలించింది అపర్ణ. ఆయన రాలేదు!

అరవ మామి కూతురుతో సహా ఎప్పుడో దిగిపోయింది. మిగిలిన ఆడవాళ్లు నలుగురూ దిగిపోయే సన్నాహంలో ఉన్నారు. బెంగాలీ యువతి మాత్రం నిశ్చింతగా పళ్లవాడితో బేరమాడుతూంది.

"క్షమించండి. మీ పేరు అపర్ణ గారేనా?" ఎవరో యువకుడు సూటిగా తననే చూస్తూ అడుగుతున్నాడు.

దూరప్రాంతాన....పరాయి చోట.... తన పేరు.... అందునా మొహమెరుకలేని వ్యక్తి నోట వింటుంటే....

పైగా, తానున్న ఈ అయోమయ స్థితిలో... ఆశ్చర్యవెూ, ఆనందవెూ-తెలియని భావమేదో చుట్టేసింది అపర్ణను.

"ఆఁ....అవును." విస్మయంగా అతని వంక చూస్తూ అన్నది గాభరాగా.

"నా పేరు వాసుమూర్తి. శేఖర్ నా ఫ్రెండ్. వాడికేదో ఇన్స్పెక్షన్ మూలాన ఈవేళ రావటానికి ప్రయత్నించినా వీలు కాలేదట. నాకు ట్రంక్కాల్ చేశాడు. మిమ్మల్ని రిసీవ్చేసుకుని గోండియా ట్రెయిన్ ఎక్కించమని. తా నక్కడ మిమ్మల్ని కలుసుకుంటానన్నాడు.... నే నిక్కడే వర్క్ చేస్తున్నానులెండి." మర్యాదగా చెప్పాడతను.

చొరవగా తనే సామానంతా జాగ్రత్తగా దింపి, లైసెన్స్ కూలీతో సామాను పట్టించుకొని చకచకా మరో

ఫ్లాట్ ఫారమ్ మీద ఉన్న ట్రెయిన్ దగ్గరికి తీసుకు వెళ్లాడు. ఖాళీగా ఉన్న కంపార్టుమెంట్ చూసి ఎక్కించి ,టికెట్ తెచ్చిపెట్టాడు.

లేడీస్ కంపార్టుమెంట్లో సెకండ్ క్లాస్ లేదు. థర్డుక్లాస్ మరీ గలీజుగా ఉంది ,అందుచేత .......అన్నాడు

నసుగుతూ.

ఫరవాలేదు లెండి అన్నది అపర్ణ నిశ్చింతగా .

అమ్మయ్య ఆపద్బాంధవు డల్లే వచ్చాడు. ఇప్పటికి కుదుటపడింది. ముసురుకున్న భయసందేహాలు ఆమెను వదిలిపోయాయి.

గత్యంతరం లేక ఇతని వెంట రైలు దిగింది కాని, ఈయనెవరో, ఎటువంటి వాడో, ఇతను చెప్పేవన్నీ నిజమవునో

కాదో ఆ టికెట్ తెచ్చి ఇచ్చేదాకా అనుమానిస్తూనే ఉన్నది .

అతను కొని తెచ్చిఇచ్చాడు.

ఇప్పుడు నాలుగు గంటలయింది. ఈ బండి గోండియా చేరేటప్పటికి రాత్రి రెండో మూడో అవుతుందనుకుంటాను.మీకు భోజన మెలాగ ఇదే పెద్ద స్టేషన్. ఆతరవాతి స్టేషన్‌లో ఏమీ దొరకదు . టిఫిన్ ఏమన్నా తెచ్చిమ్మంటారా అని అడిగాడు నమ్రతగా.

అబ్బే, వద్దు వద్దు. ఈ పళ్లు చాలు అన్నది అపర్ణ.

మరి నేను వెళ్లి వస్తాను అని సెలవు తీసుకున్నాడతను. కృతజ్ఞతగా చూస్తూ చేతులు జోడించింది అపర్ణ.

ట్రెయిన్ కదిలింది. పావను ఒళ్లో కూర్చోబెట్టుకుని వెనక్కి పరిగెట్టే పరిసరాలను తిలకిస్తూ కూర్చున్నది అపర్ణ.

పాసింజర్ కావటంమూలాన ప్రతి చిన్నస్టేషన్‌లో ఆగూతూంది ట్రెయిన్. జనం ఎక్కుతున్నారు,దిగుతున్నారు.

కాని ,అబ్బ....అంతా మోటుమనుషులు. మొరటుగా, భారీగా ఉన్నారందరూ. పైగా , ముఖాల్లో సౌమ్యత తక్కువ .కఠినత్వం ఎక్కువగా కనిపిస్తూంది. ఆడా మగా తేడా లేకుండా ఇంతింత తాంబూలం బుగ్గనిండా బిడాయించి నోటి తుంపర్లు మీద పడేలా బిగ్గరగా మాట్లాడుకుంటూ న్నారు. ఇష్టం వచ్చినట్లు కంపార్టుమెంటంతా ఉమ్ముతున్నారు చిరాగ్గా. ఆ ఆకారాలకు తోడు ఆ భాష ఒకటి .ఎప్పుడూ తమ ప్రాంతాల విన్నట్టే లేదు. వాళ్ళు మాట్లాడుకుంటుంటే దాదాపు పోట్లాటకు వెనగ్గా, అరుపులకు దగ్గరగా ఉన్నట్టుంది. బహుశా తన భావనా తప్పయి ఉండవచ్చు. వాళ్ల ప్రకృతి అంతేనేమో అనుకుంటూ వాళ్ల ఎదట ఒదిగి కూర్చున్నది అపర్ణ.

ఇంకెంత ! కొన్ని గంటలలో ఆయన సన్నిధానములో వాలబోతోంది తను. ఆయన నిరీక్షణా, తన నిరీక్షణా ఫలించబోతున్నాయి. అపర్ణ మనసు ఆనందడోలికలలో ఉయ్యాలలూగింది కాస్సేపు .ఏదో స్టేషన్లో బండి ఆగింది. కదలబోయే టైములో వయసులో ఉన్న ఓ ఆడ పిల్ల తో సహా మధ్య వయస్కు డొకరు రైలెక్కాడు.

చూడ్డానికి వాళ్లు బీదవాళ్లులా, కూలీ నాలీ చేసుకు బతికే వాళ్లలా ఉన్నారు. వేషాలు మాత్రం విచిత్రంగా ఉన్నాయి. కొయ్యపూసలు, దంతపు చెవి తమ్మెట్లతో ఆ పిల్ల, ఎర్రటి తలపాగా, బుగ్గమీసాలు, చెవికిందగా పచ్చబొట్లతో ఆ పిల్ల తండ్రీ వింతగా ఉన్నారు.

అడవుల్లో చిన్న చిన్న జంతువుల్ని వేటాడుకుంటూ, అడపా దడపా కూలీ నాలీ చేసుకుంటూ, అవీ దొరకనప్పుడు ఆటా పాటాతో ముష్టి ఎత్తుకునే....భర్త జాబుల్లో వర్ణించిన దొంగరా జాతివాళ్లు వీళ్లే కాబోలు అనుకున్నది అపర్ణ.

కష్టం చేసుకుని బతికే వీళ్లు చాలా బీదవాళ్లు- వాళ్లు సెకండ్ క్లాస్ మాట దేముదెరుగు, అసలు టికెట్ కొన్నవాళ్లలా లేరు.

అలాంటివాళ్లు కిందే ఓ మూల కూర్చున్నా సరిపోయేది. అలాగాక సీట్ల మీదికి ఎగబడేసరికి పైన కూర్చున్న పెద్ద మనుషులకి పౌరుషం వచ్చిందేమో, వాళ్ల నేమేమో అంటూ కిందికి లాగారు. ఒకతను మరీ బరితెగించి ఆ ముసలివాడి మెడబట్టి బయటికి గెంటబోయాడు కూడా.

వాళ్లు కూడా ముందు కాళ్లా వేళ్లా పడ్డారుగాని, ఆ తరవాత ఎదురు తిరిగారు. ఆ పిల్ల తాటకిలా ఒగరుస్తూ అందర్నీ ఒక్క నెట్టు నెట్టింది. దానితో అందరూ కలబడ్డం మానేశారు కాని, ఒకరితో ఒకరు మాటల యుద్ధం సాగిస్తూనే ఉన్నారు.

వాళ్ల జగడం చూస్తూన్న కొద్దీ అపర్ణ ప్రాణాలు గుప్పిట్లోకి పోతున్నాయి. మరీ ఆ పిల్ల! అపర కాళికావతారం! ఆ నోటి గట్టితనం చూస్తుంటే అసలు ఆడవాళ్ల కుండాలిసిన కోమలత్వం ఈ పిల్లకు బొత్తిగా లేదేమిటాని విస్తుపోయింది అపర్ణ. ఆశ్చర్యానికి తోడు వింత భయంకూడా ఆవరించింది.

మళ్లీ ఏదో స్టేషన్ వస్తూంది. రైలు వేగం తగ్గటం మొదలెట్టగానే హఠాత్తుగా ఆ పిల్ల నోరూ, తండ్రి నోరూ సన్నగిల్లిపోయాయి. సడీ చప్పుడూ లేకుండా కిందే ఓ మూల ముడుచుకు కూర్చున్నారు బితుకు బితుకుమంటూ.

రైలు ఆగింది. పెట్టెలో ఉన్న ఇద్దరు మనుషులు ఆ తండ్రీ కూతుళ్లని ఏధో బెదిరిస్తూ దిగి వెళ్లారు.

వాళ్లు వస్తూ ఓ టి.సి. ని వెంట బెట్టుకొచ్చారు. ఆయనతో ముందే ఏమి చెప్పారో గాని, వస్తూనే కళ్లెర్రచేసి ఆ ఇద్దర్నీ భుజాలు పట్టుకుని ఇవతలకు లాగాడు. వాళ్లు దణ్నాలు పెడుతూ ఆయన్ని బ్రతిమలాడుతున్నారు. అదేం భాషోగానీ, దెబ్బలాడుతున్నా, గందరగోళంగానే ఉంది. బతిమలాడుతున్నా గోలగోలగానే ఉంది. ఆయన లొంగక వాళ్లని దించేశాడు. ఇందాక నలుగురిని అలాగ్గా నెట్టేసిన ఆ మగనారి ఆ టి.సి. ముందర పిల్లి అయిపోయి దిగిపోతుంటే న్యాయాని కా మాత్రం విలువ ఉన్నందుకు సంతోషించింది అపర్ణ. కాస్త జాలీ వేసింది.

వాళ్లు దిగిపోయాక హాయిగా ఊపిరి పీల్చుకున్నది. మళ్లీ రైలు కదిలింది. స్టేషన్ పది గజాలు దాటిందో లేదో, కంపార్ట్ మెంట్ తలుపు తెరుచుకుని మళ్లీ ఆ దింపేసిన వాళ్లిద్దిరూ ప్రత్యక్షం! నిర్ఘాంత పోయింది అపర్ణ. 'వీళ్లెక్కడ, గడితేరిన రకమల్లే ఉన్నారే!' అనుకుంది భయం భయంగా.

ఈసారి బండిలో ఉన్న మగ మహారాజులు కూడా నొసళ్లుచిట్లించుకుని వాళ్ల వంక మిర్రి మిర్రి చూసి, సన్నగా గొణుక్కుని ఊరుకున్నారు. తమకంటే మొండివాళ్లనుకున్నారేమో!

అప్పటికి బాగా చీకటి పడింది. గాఢాంధకారంలోంచి దూసుకుపోతూంది రైలు.

నిద్ర ముంచుకు వస్తూంది అపర్ణకు. కాని, కన్ను ముయ్యడానికి భయం, 'బోలెడు సామాను, కొద్దో గొప్పో నగలున్నాయి ఒంటిమీద, తాను కునుకు తీస్తే ఓ సంచీ భుజాన పెట్టుకుపోగల రాక్షసిమూక. ఏమరి పాటుగా ఉండటం మంచిది కాదు. అసలా కాళికావతారం! ఆ అమ్మాయి ఒక్కత్తి చాలు, తన ప్రాణానికి. మేలుకొని ఉన్నా దబాయించి కళ్లప్పగించడం తప్ప?

'ఆమాత్రం దానికి మేలుకుని కూచోవడ మెందుకు?' వెనక్కి వాలి పోయింది అపర్ణ, నిశ్చింతగా మాత్రం కాదు.

రైలు ఒకే వేగంతో పోతూ ఉన్నది. నిద్రపోతున్న రాక్షసుడి ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లాంటి క్రమిబద్ధమైన ఛుక్ ఛుక్ మనే శబ్దమూ, ఉండి ఉండి కలవరింత లాంటి ఓ వెర్రికూతా ఆమెకు గాఢనిద్ర పట్టనివ్వలేదు.

ఆకలైంది కాబోలు పాప లేచింది. తల్లి ముఖాన్ని తడుముతూ ఏడుపు ప్రారంభించింది. అపర్ణ లేచింది. పాపకు పాలు పట్టాలి. పాలడబ్బా తీసింది. అడుగున కొద్దిగా ఉన్నది పాలపొడి. 'అయ్యయ్యో..... తన తొందరలో పాపాయి పాలడబ్బా మాటే మరిచిపోయింది! నాగపూర్‌లో అతనితో తెప్పించితే పొయ్యేదే.... చాలా సేపు రైలాగిందికూడానూ. ఇప్పుడేమనుకుంటే ఏం లాభం?..... ఉన్న కొంచెమూ ఈ ఒక్కసారికీ సరిపోతే ఈ రాత్రి మరి లేవదు పాపాయి! రేపు పొద్దున్నకి అడంగుకి ఎలాగూ చేరుకుంటుంది కాబట్టి ఫరవాలేదు.'

పాలు కలివి పట్టించి జోకొట్టింది పాపను. తనకి నిద్ర తేలిపోయింది. కళ్లు మాత్రం మండిపోతున్నాయి. కళ్లు చిట్లించి కిటికీలోంచి చీకట్లోకి చూడటానికి ప్రయత్నిస్తూ కూర్చుండిపోయింది.

బయట చీకటిని చీల్చడానికి ప్రయత్నిస్తున్నాయి మిణుగురులు. దగ్గిరలో చెట్లు ఎక్కువే ఉన్నట్లున్నాయి. విపరీతంగా వందలూ వేలూ ఎగురుతున్నాయి మిణుగురులు విశృంఖలంగా.

రైలు వంపు తిరిగేతప్పుడు హెడ్‌లైట్ వెలుగులో పరిసరాలు కొంత అస్పష్టంగా అగుపడ్డాయి. కొండల పక్కంటే పోతూంది రైలు. కొండల మీద ఒత్తుగా ఎదిగిన వృక్షాలు, ఎదుగుతున్న మొక్కలు, అల్లిబిల్లిగా మానుల్ని అలుముకున్న అడివితీగెలతో... పగలైతే సుందరంగానే ఉండునేమో గాని దట్టమయిన ఆ చీకట్లో మనుష్య సంచారం లేని ఆ కొండప్రాంతం జీబురుమంటూ భయం భయంగా ఉంది.

చలిగాలి రివ్వున మొహాన్ని తాకేసరికి తల లోపలికి తిప్పుకుంది అపర్ణ.

ఆ దుర్గ.... అదే.... ఆ పిల్ల ఈసారి కిందనే ఓమూల ముడుచుకుని పడుకుంది. ఆ పిల్ల పక్కనే ఆ ముసిలాడు అంగరక్షకుడుగా తలుపునానుకుని కూర్చుని ఉండి ఉండి ఓరగా సీట్లల్లో కూర్చున్న బాబులవంక ఓ చూపు విసిరేస్తున్నాడు.

'దొంగచూపులూ వాడూనూ' అనుకుంది అపర్ణ.

పెద్ద కుదుపు! ఉన్నట్టుండి హఠాత్తుగా రైలు ఆగింది. స్టేషన్‌నొచ్చి ఆగటం కాదది. సడన్‌గా బ్రేకుపడి ఉండాలి.

ఆ కుదుపుకి పాపాయి బెర్త్ పై నించి కింద పడి గొల్లున ఏడుపు లంకించుకుంది. అపర్ణ నుదురు ఎదుటి సీటుకి కొట్టుకుని ఓ క్షణం కళ్ల ముందు చీకట్లు కమ్మాయి. దిమ్మెత్తిన తల విదిలించుకుని తనని తాను బలవంతాన నిలదొక్కుకుంటూ పాపాయిని లేవనెత్తుకుని గుండెల కదుముకుంది విపరీతమైన భయంతో.

కంపార్ట్ మెంటంతా గందరగోళంగా ఉంది. అధార్తుగా జరిగిన ఉపద్రవానికి ఏమరుపాటుగా కునుకు తీస్తున్న వాళ్లందరికీ తలలు బొప్పెలు కట్టాయి.

స్తిమితపడి అసలేం జరిగిందా అన్న ప్రశ్న తలెత్తినప్పటిగ్గాని, బయట ఇంతకన్న గడబిడగా ఉన్న సంగతి తెలిసిందికాదు ఎవరికీ.

ఏవో కేకలు, రొదన, ఏడ్చే పిల్లలు. ఎన్నో గొంతులు కలగాపులగంగా అరిచే మోత. కొన్ని నిమిషాల గారాంధకారం తరవాత సన్నని వెలుతురు.

అపర్ణకేమీ బోధపడ్డం లేదు. ఆ పెట్టెలోని వారందరూ దాదపూ దిగి వెళ్లారు. ఆదుర్దాగా బయటకు తొంగిచూచింది. తెల్లటి యూనిఫారమ్ వేసుకున్న టి.టి.ఇ. ఒకతను లాంతరు పట్టుకుని తన కిటికీ ముందు నించే రెండు మూడు సార్లు అటూ ఇటూ హడావిడిగా తిరిగినా, ఏమి జరిగిందో తెలనుకోవాలనే తహతహ లోపల ఉన్నా నోరు తెరచి అడగలేక పోయింది.

మూడో సారి తెగించి అడిగేసింది. "ఏమిటయిం"దని ఇంగ్లీషులో...

పనితొందరలో పోతున్న ఆ టి.టి.ఇ. ఆమె మాట వినీ పట్టించుకోనట్టు ముందుకు పోబోతూ యథాలాపంగా తల ఎత్తి చూసి... బహుశా మర్యాద ఇవ్వవలసిని వ్యక్తిగా గుర్తించికాబోలు. వినుగ్గా ఉన్న ముఖకవళికలను మార్చుకుని సమాధానం చెప్పారు.

"పెద్ద కొండచరియ విరిగి రైలు పట్టాలమీద అడ్డంగా పడింది. పట్టాలు పూర్తిగా మూసుకుపోయాయి. ప్రమాదం పది గజాల్లో ఉండగా డ్రైవరు తెలుసుకుని బ్రేక్ వేశాడు. లేకపోతే చాలా ఘోరమే జరిగి ఉండే దివాళ."

"మరి రైలు మళ్లీ ఎప్పుడు బయలుదేరుతుంది?" ఎవరి ఆరాటం వాళ్లది!

"అబ్బో, అప్పుడే ఎక్కడ? ముందు పక్కస్టేషనుకు కబు రందిస్తే వాళ్లు సహాయం పంపి ఈ కొండరాళ్లను తొలగించినప్పటి మాట! అందాకా 'అలో లక్ష్మణా' అంటూ ఈ అడివిలో పడి ఉండక తప్పదు."

"అమ్మో" అప్రయత్నంగా అనేసింది అపర్ణ.

ఆమె ముఖంలోని భయాందోళనలు గమనించినా ఆ టి.టి.ఇ. "మరేం ఫర్వాలేదండీ! త్వరలోనే మనకు సహాయం అందుతుంది. రే పీపాటికి మనం తిరిగి బయలుదేరవచ్చు" అని ధైర్యం చెబుతూ వెళ్లిపోయాడు.

దిగాలు పడిపోయింది అపర్ణ. ఏవిటి ఆటంకాలు!

తిథి, వారం, వర్జ్యం, నక్షత్రం అంటూ అమ్మ అన్నీ చూసి, లగ్నం పెట్టించి, మంచి శకునం చూపి బయలు దేరదీసినందు కిదా ఫలితం! మరిక కళ్లమీద కునుకు దాలేదు అపర్ణకు.

తెలతెలవారుతూంది. చీకటి పరదాలను తొలగించుకొంటూ ఉషాబాల మార్చి మార్చి ముస్తాబులు చేసుకుంటుంది.

విరబూసిన అడివిపూలూ, మంచు బొట్లు రాలుస్తున్న చిగుళ్లూ, రెక్క లల్లారుస్తూ కువకువ మంటున్న పిట్టలబారూ అడగకుండానే ఆమెకి అలంకరణ సామాగ్రిని అందిస్తున్నాయి.

అపర్ణ కొంతసేపు తన దిగులంతా మరిచిపోయింది. ఎప్పుడూ కుండీలలో నియమబద్ధంగా పెంచిన క్రోటన్ మొక్కల ముగ్ధ సౌందర్యానికే అలవాటు పడిన అపర్ణ స్వేచ్ఛగా, విచ్చలవిడిగా పెరిగిన ఆ అడివి తీగల వినర్గ రమణీయకతకీ ఉక్కిరిబిక్కిరయింది. ప్రశాంతతకి ఆటపట్టుగా ఉండాలిసిన ఆ ప్రదేశం- అనుకోని ఈ సంఘటనతో, మనుష్యుల కలకలంతో వింతగా మారిపోయింది.

పాప లేచేసరికి అసలు సమస్య కళ్ల ముందు కొట్టవచ్చినట్టయింది. పాలపిండి నిండుకున్నది.

పాప నెలా ఈ రోజంతాఆపటం? నిన్న మధ్యాహ్నమనగా తిన్న భోజనం! తనకీ నీరస మొస్తూంది.

అల్లిబిల్లిగా "అc...ఊc..." అంటూ ప్రారంభించిన పాపాయి ఊకుళ్లు క్రమంగా రాగంలోకి మారి, కొద్ది సేపట్లో తారస్థాయి అందుకున్నాయి.

అవి అలా తగ్గేది కాదని తెలిసినా చాలా సేపు సముదాయించింది. అపర్ణ. మరిక ఓపిక లేక నిస్సహాయంగా ఉండిపోయింది.

బండి మరింక ఇప్పట్లో కదలదు అని తెలిసిన తరవాత మిగిలిన ప్రయాణికు లెవరూ అంతగా కంపార్ట్‌మెంట్‌లోకి రావడం లేదు. అలా అలా తిరుగుతూ అప్పుడప్పుడూ సామాన్ల వంక తొంగి చూసుకుంటున్నా రంతే.

ఆ ముష్టి పిల్ల మాత్రం మొదటి నించీ అపర్ణను గమనిస్తూనే ఉంది. పావ ఏడుపునుఆపలేక అపర్ణ పడుతున్న అవస్థ చూశాక ఏమనుకున్నదో మరి.... దగ్గిరసా వచ్చి 'పాలు పట్టరాదా' అన్నట్టు పాలసీసా చూపిస్తూ సైగచేసి చూపించింది.

లేవని చెప్పింది అపర్ణ చేత్తోనే. ఆ పిల్లతో మాట్లాడ్డం ఇష్టం లేకపోయినా తప్పనిసరైంది.

ఏడ్చి ఏడ్చి పాపాయి శోష వచ్చినట్టు సొమ్మసిల్లింది. అది చూసి అపర్ణ ప్రాణం ఎగిరిపోయింది.

ఇందాకటినించీ ఏడుస్తున్న పాపాయిని తా నెత్తుకుంటానని చెప్పడానికి సాహసం లేక తటపటాయిస్తున్న ఆ ముష్టి పిల్ల మరింక వెనకాడక చటుక్కున పాపాయి నెత్తుకుని, చన్నీళ్లతో మొహం తుడిచి ఆ నీళ్లే కొన్ని పట్టించింది.

తెప్పరిల్లిన పాపాయి మళ్లీ గొంతెత్తింది. ఏం చెయ్యాలి? పాపాయి ప్రాణం కాపాడుకోగలదా తను?

అవసరం తోసుకొచ్చేసరికి ఎక్కడ లేని ధైర్యం పొంగుకొచ్చింది.

తమ కంపార్ట్‌మెంట్‌లో పసి పిల్లల తల్లుల మాట అటుంచి, పెళ్లి కాని ఈ అడివిపిల్ల మినహామరేఆడవాళ్లూ లేరు. తెగించినట్లు పాపను భుజాన వేసుకుని, పాలడబ్బా పుచ్చుకుని పక్క కంపార్ట్ మెంట్లలో పసిపిల్లల తల్లులున్నారేమో వెతుకుదామని బయలుదేరింది అపర్ణ.

వెనక నీడలా ఆ పిల్ల అపర్ణని

అనుసరిస్తూనే ఉన్నది.

అయిదారు కంపార్ట్మెంట్లు వెదికినతరవాత ఓ బిడ్డతల్లి కనిపించింది.

పిల్లవాణ్ణి అడ్డాల్లో వేసుకుని నిశ్చింతగా పాలు ఇస్తున్న ఆవిణ్ణి చుశాక, తానిక 'పాలపిండి ఉన్నదా?' అని అడగటం కూడా వృథా అని గ్రహించుకున్నది.

దృఢంగా , ఆరోగ్యంగా ఉన్న ఆ తల్లికి ఇలాంటి కృత్రిమాహారం తన పిల్లడికి పట్టాలిసిన ఖర్మమేమిటీ! చేసేదిలేక వెనక్కి తిరిగింది.

అపర్ణతోపాటు వెనక్కి తిరగలేదా పిల్ల. పాపని చూపించి ఏదో చెబుతూందా విడతోటి.

'బహుశా పిల్లవాడితోపాటు పాపకు కూడా కొంచెం పాలిమ్మని చెప్పి ఉంటుంది.'

దాని కావిడ ఒప్పుకోడం లేదని- చేతులు తిప్పుతూ సుదురు చిట్లించుకోడం బట్టి గ్రహించుకున్నది అపర్ణ.

ఈ పిల్ల తిరిగి ఏమన్నదోగాని, ఆవిడ గొంతు చించుకుంటూ కళ్లెర్ర చేసి కొట్టవచ్చినట్టుముందుకొచ్చేసరికి తననే తిడుతున్నట్లు బెదిరిపోయి గబగబా తను కంపార్ట్ మెంట్లోకి వచ్చిపడింది అపర్ణ.

నోరు మూత పెట్టకుండా, ఆవిడకు తగ్గట్టు తనూ గొంతు పెంచుకుని మాటకు మాట బదులు చెబుతూ ఆ పిల్లా వచ్చేసింది వెనకాలే!

కాస్సేపు కక్కటిల్లి ఏడ్చే పాపయి వంకా, దిక్కుతోచక, దేవుడిమీద భారంవేసి చేతులు ముడిచి కూర్చోలేకా, పాపాయిని ఊరడిస్తూ తల్లడిల్లి పోతున్న అపర్ణవంకా మార్చి మార్చి చూస్తూ కూర్చున్న దా పిల్ల.

ఇంతలో ఏమి తట్టిందో చరాలున లేచి రైలు దిగింది. ఎదురుగా చెట్టుకింద, ఆ చెట్టుపుడకే ఒకటి నవులుతూ దంతధావనం చేసుకుంటున్న తండ్రి దగ్గిరికి వెళ్లి ఏదో పురమాయించి, వెనక్కి తిరిగొచ్చింది.

చేతిలో పుల్ల దూరంగా విసిరి తుపుక్కున ఉమ్ముతూ దూరంగా ఎటో వెళ్లాడా మునలతను. కాస్సేపటిలో పైవంచ వెడతాడుగా వేసి ఓ నల్ల మేకను ఈడ్చుకుంటూ వచ్చాడు. తప్పించుకోవాలని చూస్తూ తెగ అరుస్తున్నదది. ఆ గోలకి నలుగురూ దానిచుట్టూ మూగుతున్నారు.

మేకను చూచిపాపాయి పాలబుట్టలో పైన కనబడుతున్న గ్లాసు తీసుకుని ఒక్క దూకు దూకిందాపిల్ల తండ్రి దగ్గరకు.

తెల్లబోయి చూసన్తూంది అపర్ణ. దూరంగా మేకను చెట్టుకు కట్టేసి, ముసలతను మేక వెనక కాళ్లను పట్టుకుంటే, నేర్పుగా గ్లాసులో పాలు పిండుతున్న ఆ పిల్ల కనిపించింది.

కాస్సేపటిలో ఎవరి దగ్గిరో అగ్గి పెట్టె సంపాదించి, చితుకులు ముట్టించి గ్లాసుతో పాలు వెచ్చబెట్టి వచ్చేసింది అపర్ణ దగ్గిరికి.

అప్పటివరకూ ఆ పిల్ల చర్యల్ని విస్మయంగా చూస్తూ ఉండిపోయిన అపర్ణ జాగృతిలోకి వచ్చి తొట్రుబాటుగా గ్లాసందుకుని పాలు చల్లారబెట్టి పాపాయికి పట్టించింది సంతృప్తిగా, మిగతా పాలు చొరవగా ఆ పిల్లే పాపాయి ఫ్లాస్కందుకుని దాన్లో పోసి భద్రపరిచింది.

పాపాయి బొజ్జ చల్లబడింది. అపర్ణ మనసూ చల్లబడింది.

అంతవరకూ వికృతంగా, ఒక రాక్షసిలా కనిపించిన ఆ అడివిపిల్ల అపర్ణ కిప్పుడు దేవత!

అసహ్యంగా ఉన్న ఆ పిల్ల మురికి బట్టలుగానీ, సభ్యతలేని మోటుచేష్టలు గానీ ఇప్పుడు చిరాకు కలిగించటం లేదు సరికదా, ఆ అందవికారానికీ, ఓడుతున్న దరిద్రానికీ వెనక మహోజ్జ్వలంగా వెరుస్తున్న మానవత్వానికి మౌనంగానే జోహారు లర్పించింది ఆమె అంతరాత్మ.

ఆ పిల్లకు కృతజ్ఞత తెలపాలనీ, ఏమన్నా మాట్లాడాలనీ అపర్ణ ఆరాటం! కాని, ఏం లాభం? మాటలోచ్చీ మూగవాళ్లయి ఉండాలిసి వచ్చింది. ఒకరి భాష ఒకరికి తెలియదయ్యె!

ఇంతలో బయట గల్లంతు ఒక్క సారిగా ఎక్కువ అయింది. జనం తొందర తొందరగా అటూ ఇటూ పరిగెత్తుతున్నారు.

గోల మొదలుకాగానే పెట్టెలోనించీ ఆ పిల్ల ఎప్పుడో మాయమయింది. అందుచేత చాలా సేపటిగ్గానీ ఆ సందడికి కారణం తెలుసుకోలేక పోయింది. అపర్ణ.

ట్రాలీలో పనివాళ్లు కావలసిని పరికరాలతో సహా పక్క స్టేషను నించీ దిగారు. వారితోపాటు రైలుబండిలో ప్రయాణికులకు ఆహార పదార్థాలు- కూడా వచ్చాయి. దానితో తొక్కిసలాట మొదలయింది.

ఎవరికి వారికే తొందర! ముందు తమకు దొరుకుతాయో లేదో అని తొందర! ఆ తరవాత తమ వాళ్లకు అందుతాయో లేదో అని తపన! ఆ పైన సరిపోతాయో లేదో అని ఆరాటం!

యుద్ధం ముగిశాక విజయపతాకాన్నం దుకున్న సైనికుల్లా చెట్లకింద ఆసీనులై ఫలహారం సేవిస్తున్నారు. ఆ తోపులాటలో గెలుపు సాధించిన కొందరు మహామహులు

అపర్ణ జఠరాగ్ని పని చెయ్యటం మొదలెట్టింది. 'తానుకూడా వెళ్లి తెచ్చుకుంటేనేం? అందరిలా చెయ్యి జాపి తెచ్చుకోడానికి నామర్దాపడితే రేపటిదాకా ఆకలికి ఆగగలదా?......'

కంపార్ట్‌మెంట్ దిగి, అటుకేసి నాలు గడుగులు వేసి ఆగిపోయింది అపర్ణ. 'ఉహుఁ ...' ఆ కుమ్ములాట చూశాక ఇక ఆ పూటకు ఏకాదశి ఉండటం నయమనిపించి వెనక్కి వచ్చేసి, పాపాయి పక్క చోటు చేసుకుని కళ్లు మూసుకున్నది అపర్ణ.

ఆకలి కడుపుని జోకొట్టడం మాటలతో పనికాదు. కాసిని మంచి నీళ్లేనా తాగుదామని లేచి కూచున్నది అపర్ణ.

ఎదురుగా ఆ పిల్ల! తాను కళ్ళు తెరుచుకోడం కోసమే కాచుకున్నట్టుగా నిలబడి ఉంది. వచ్చి మోదుగాకుల్లో గోధుమరొట్టెలు, ఆ ఆకులతోనే మడిచిన దొన్నెలో ఏదో కూర! అపర్ణ ఎదురుసీటుమీద జాగ్రత్తగా పెట్టి, తానవి ముట్టుకోలేదనీ, శుభ్రంగా చేతులు కడుక్కునే తెచ్చాననీ, తీసుకోమనీ శతవిధాల చేతుల్తోనూ, కళ్లతోనూ ప్రాధేయపడుతూ వేడుకోలుగా సైగలు చేస్తూంది.

ఏ అనుబంధం తమ మధ్య ఉన్నదని ఆ పిల్ల తన నంతగా ఆదుకుంటూంది? అమాయకమయిన ఆ పిల్ల అభ్యర్థనని ఎలా తిరస్కరించడం? వద్దని ఆ పిల్ల మనసు నొప్పించటం ఎలా?

మాట్లాడక తీసుకున్నది అపర్ణ. ఉప్పు, కారం లేని చప్పిడి రొట్టెలు, ఏదో వాసనవేసే కూర....కాలేకడుపుకు పంచభక్ష్య పరమాన్నా లయ్యాయి.

అంతసేపూ పాప నెత్తుకుని తన వంకే ఆప్యాయంగా చూస్తూ ఉండి పోయిందా అమ్మాయి.

'అరే! ఆ అమ్మాయి తిన్నట్టే లేదే? వాళ్లకి ఇచ్చినవన్నీ తనకే ఇచ్చేసినట్టుంది! ఆలోచనా పాలోచనా లేకుండా

అన్నీ అమ్మవారిలా దిగమింగి ఊరుకుంది తను! ఇక ఆ అమ్మాయికి ఈ రోజు నిరాహారమే కాబోలు. రైల్వే వాళ్లు ఉదారంగా ఇచ్చే ఆ ఆహారం ఒకసారి దొరకడమే అబ్బురంగా ఉంటే, రెండోసారి తేవడం అంత సులభం కాదే. పాపం! తన కోసమని ఆ అమ్మాయి కడుపు మాడ్చుకున్నదన్న ఊహ అపర్ణ మనసులో ఆ అమ్మాయి విలవని మరింత పెంచి కలత పెట్టేసింది.

ఆ రోజంతా ఆ పిల్ల పాప నాడిస్తూనే గడిపింది. పెట్టెలో కాస్సేపూ, విసుగెత్తి నప్పుడు బయట చెట్లకిందా పాప నెగరేస్తూ, అది కేరింతలు కొట్టేటప్పుడు తనూ పకపకలాడుతూ, తప్పట్లు తడుతూ చిన్నపిల్లలా అమాయికంగా ఆడుకున్నది. హాయిగా, వినోదంగా చూస్తూ కూర్చున్నది అపర్ణ. పగలంతా ఇట్టే గడియిపోయింది.

క్రితం రాత్రిలా కాక హాయిగా నిద్రకూడా పట్టింది అపర్ణకు. నిన్నటి రాత్రి ఎవరికి జడిచి నిద్రకు దూరమయిందో వారినే ఈ రోజు తనకు అంగరక్షగా నిలబడగలరని నమ్మి నిద్రపోగలిగింది. చిత్రం!

తెల్లవార్లూ సాగించిన కృషివల్ల రైల్వేలైన్ బాగయింది. గార్డ్ పచ్చజెండా ఊగించడంతో ప్రయాణికుల ఉత్సాహం పెల్లుబికి చేసే జయజయ ధ్వనులు మధ్య యథా ప్రకారం రైలు తన యాత్ర తిరిగి కొనసాగించింది.

ఒక్కొక్క స్టేషనూ మరుగవుతుంటే స్వర్గానికి ఒక్కొక్క అడుగే వేస్తూ చేరువవుతున్న భర్తను తలచుకుని మైమరిచిపోయింది అపర్ణ.

తన లెక్క ప్రకారం వచ్చే స్టేషనే గోండియా. సామాన్లనీ లెక్క చూసుకుని దగ్గరగా పెట్టుకున్నది. పాపకు బట్టలు మార్చి బొట్టూ కాటుకా తీర్చి దిద్దింది. తానూ సాధ్యమయినంత వరకూ అలంకరించుకుని తయారుగా కూర్చుంది.

అప్పుడు వచ్చాడు టి.టి.ఇ. రైలు ఆగాలి, దిగాలి, ఎక్కాలి అనే నియమాలు వాళ్లకు వర్తించవు. చెక్ చేసుకుంటూ నడుస్తున్న రైలులోనే పెట్టెలు మారగలరు అవలీలగా.

టికెట్ తీసి చూపించింది అపర్ణ. బిక్కచచ్చి, ఒదిగి ఒదిగి మూలకు ముడుచుకు పోతున్నారు ఆ తండ్రీ కూతుళ్లు. అప్పుడు గమనించింది అపర్ణ వాళ్లని. వాళ్లకు టికెట్లు లేవు. ఏం చేస్తాడో ఈ టి.టి.ఇ.? బహుశా కేసుపెట్టి జైలుకి పంపిస్తాడేమో? లేకుంటే చితక తన్నయినా వదులుతారు. ఒక వైపు వేషం మార్చి టికెట్ లేకుండా మొదటి తరగతిలో ప్రయాణం చేసే ఘరానా పెద్ద మనుషులు సురక్షితంగా జారుకుంటూనే ఉన్నారు. ఇటువైపు వీరి డ్యూటీ మహా కరెక్ట్‌గా, ఇలాంటి పేదవాళ్లమీద విశృంఖలంగా పెచ్చరిల్లి పోతుంటుంది. వీరిద్దరినీ ఇతని బారికి వదలడమే?

"వీరిద్దరికీ ఛార్జీ ఎంత కట్టాలిసి ఉంటుంది?" ముసిలతన్ని గదమాయిస్తున్న టి.టి.ఇ.ని అడిగింది కలగజేసుకుంటూ.

విచిత్రంగా చూశాడు ఆ టి.టి.ఇ. అపర్ణ వంక.

ఈమె కెందుకూ? తను చెల్లిస్తుందా?

"ఏం? మీరు కడతారా?" అన్నాడు కిందనించీ పైదాకా పరీక్షగా చూస్తూ.

"అవును" అతని చూపులకి చిరాగ్గా మొహం చిట్లించుకుంటూ అన్నది అపర్ణ.

"కట్టాలిసివస్తే బండి బయలు దేరే స్టేషనునించీ చెల్లించాలిసి ఉంటుంది. టికెట్ లేకుండా ప్రయాణం చేసినందుకుగాను జుల్మానాతో సహా వంద రూపాయలురపైన అవుతుంది. ఇస్తారా?" అన్నాడతను, ఆమె వంక హేళనగా చూస్తూ.

వివర్ణ మయిపోయింది అపర్ణ మొహం. తన దగ్గరున్నదంతా కూడినా అరవై రూపాయలకంటే ఎక్కువ లేదు.

చులకనగా చూశాడు ఆ టి.టి.ఇ. 'మీ లాంటి వాళ్ల దాతృత్వవు దూకుడు ఎంతవరకో నాకు తెలియదూ? అన్నట్టున్నాయి అతని చూపులు.

అతని కేం తెలుసు! వంద రూపాయలు కాదు, ఎంతిస్తే మటుకు తను వాళ్ల ఋణం తీర్చుకోగలదు? ఇప్పుడు తన దగ్గర లేకగానీ ఆ వందా ఇతని మొహాన వేసి ఉండేది. ఆ స్తోమతు తనకి ఉంది.

ఇప్పుడు మాత్రమేం? రైలు ఆగగానే ఆయన కనిపించిన వెంటనే వీళ్లని విడిపించే సాధనమేమిటో మొట్టమొదట ఆలోచించాలి. అప్పుడు చూస్తాను ఇతని మొహం ఎంత నల్లబడి పోతుందో!

గమ్యస్థానం చేరుకున్నది రైలు, బండి ఆగటమేమిటి, శేఖర్ మొహం కనిపించిన అపర్ణ మొహం వికసించట మేమిటి ఒక్కసారే జరిగాయి.

"అపర్ణా, వచ్చేశావా? పాపేది? వాసు కనిపించాడా నాగపూర్‌లో? నిన్న చాలా ఇబ్బంది పడి ఉండాలి ట్రెయిన్‌లో....ఏం? ముందు నువ్వు దిగు. పాప నిలా ఇయ్యి." ఊపిరి సలపకుండా ప్రశ్నవెంట ప్రశ్న వేస్తూ సమాధానమిచ్చే టైం కూడా ఇవ్వకుండా ఉక్కిరి బిక్కిరి చేసేస్తూ, ఒక పక్క సామాను దించుతునే మరో పక్క కూలివాణ్ణి కేకేస్తూ హడావిడి పడిపోతున్నాడు శేఖర్.

తోసుకుంటూ, దిగేజనాన్ని దూసుకుంటూ ఎక్కుతున్నారు జనం. అపర్ణకు కంగారుగా ఉంది. ఆ టి.టి.ఇ.వాళ్లని దింపుకుపోతున్నాడు ఎటో. సామాను భర్త దింపేశాడు. తానూ దిగిపోయింది తొందరగా. 'ఏం చెయ్యాలి తను? ఏం చెయ్యాలనుకుంది? భర్త దగ్గిర తన కింకా చనువేర్పడ లేదు. కాని, ఊరుకోవడమెలా? వేడుకోవాలా? ఆజ్ఞాపించాలా?'

"ఏమండీ, వాళ్లు.... వాళ్లు...." అన్నది అపర్ణ వాళ్లు కనుచాటయి పోతారేమోనని ఆదుర్దాగా అటేచూస్తూ.

పెట్టె, బెడ్డింగా కూలివాడి నెత్తి కెత్తుతున్న భర్త, 'ఏమిటి?' అన్నట్టు చూశాడు అపర్ణ వంక ప్రశ్నార్థకంగా. ఆ చూపులో తొణికిసలాడుతున్న ప్రీతికి ధైర్యం తెచ్చుకుని, "అదిగో నండీ, ఆ టి.టి.ఇ. తీసుకుపోతున్నాడే..... వాళ్లు....." అపర్ణ ఆగింది, అంత చప్పున ఎలా వివరించాలో తెలియక-

అపర్ణ చూపిస్తున్న వైపు ఆశ్చర్యంగా చూశాడు శేఖర్. మేకల్లా తల వంచుకుని పోతున్నాడు వాళ్లద్దరూ టి.టి.ఇ. వెనకాల.

"వాళ్లా? టికెట్ లేకుండా ప్రయాణం చేసి ఉంటారు. దొంగ వెధవలు. ఈ మధ్య ఇలాంటివాళ్ల సంఖ్య ఎక్కువయిపోయింది. అంచేతే రైళ్లలో దొంగతనాల జాస్తీ అయిపోయాయి. పట్టుబడ్డట్టున్నారు. నాలుగు తన్ని జైల్లో పారేస్తారు. కుదరాలిసిందేలే వాళ్ల రోగం." నిరసనగా అన్నాడు శేఖర్.

"కాదండి....వాళ్లు....వాళ్లు...." విసుగ్గా వెనక్కి చూశాడు శేఖర్. "ఏమిటీ.... వాళ్లు?" అన్నాడు నుదురు చిట్లించి.

భయంతో జంకుతూ. అదికాదండీ, ఆ ప్రమాదం జరిగిన చోట వాళ్లు నా కెంతో సాయం చేశారు...." అని ఇంకా ఏమేమో వివరంగా చెప్పబోయేంతలోనే, "అయితే ఏమంటావ్... ప్రయాణంలో ఆ మాత్రం ఒకరి నొకరు సాయపడ్డం విడ్డూరమేమీ కాదులే! అయినా, ఇప్పుడు వాళ్లని విడిపించమంటావా ఏమిటి ఖర్మ?.... చేతి జులుము వదిలేమాట అలాఉంచు! పిచ్చివాణ్ణనుకో గల రందరూ! నడు నడు....." గబగబా జనంలో దారి చేసుకుంటూ పోతున్న భర్త అడుగులో అడుగు వేసింది అపర్ణ, నిట్టూర్పు ఆపుకుంటూ.

ఈ లోకం తాలూకు నకిలీ మకిలీ ఇంకా అంటని ఓ బేలమనస్సు తప్పు చేస్తున్నట్టు మూగగా రోదించింది. ●